క్లుప్తంగా

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

జూలూరుపాడు: మండలంలోని 10 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాల ఎన్నికల కోసం గురువారం నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ తాళ్లూరి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థులకు 21 ఏళ్లు నిండి ఉండాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని, నామినేషన్ పత్రంలో తప్పులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మండలానికి 99 పోలింగ్ బాక్స్‌లు

పాల్వంచరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన తొలిదశలో జరగనున్న ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బాక్స్‌లు బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. 10 ఎంపీటీసీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన 57 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునే పోలింగ్ బాక్స్‌లను కలెక్టర్ పంపించారు. వాటిని ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ చెన్నకేశవులు స్వాధీనం చేసుకుని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు.

పరిష్కారం అయ్యే వరకు సమ్మె

ఇల్లెందు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్లు ప్రకటించారు. ఇల్లెందులో డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమ్మె 27వ రోజు బుధవారం కొనసాగింది. అబ్దుల్ నబీ, కిరణ్, కృష్ణ, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, మంగ, కోటమ్మ, భాగ్యలక్ష్మి, లక్ష్మణ్, లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో డాక్టర్ కందుల దినేష్ ఆదేశాల మేరకు బుధవారం బద్దుతండా, స్టేషన్ తడకలపూడి, గుండ్లమడుగు, రోడ్డు గుంపులలో వైద్యశిబిరాలు నిర్వహించారు. మలేరియా, డెంగీ, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పీహెచ్ఎన్ చంద్రకళ, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ శైలజ, రాంబాబు, ధరణి, ఇంద్రజ, అమూల్య, వీరభద్రమ్మ, లక్ష్మీబాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

చుంచుపల్లి: లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం పోషణపక్షంలో భాగంగా సీమంతం నిర్వహించారు. పాల్వంచ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న, హేమచంద్రాపురం సెక్టార్ సూపర్‌వైజర్లు కమల, సుమతి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పాల్వంచ: స్థానిక ములకపల్లి రోడ్డులోని కుంటినాగుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బుధవారం ఎస్ఐ జీవన్ రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను ఆపి వాహనపత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించారు.

యూనియన్‌లో చేరిక

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ కాలనీలోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్-142) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు యూనియన్‌లో చేరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.రామారావు యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సంక్షేమ కోసం యూనియన్ కృషి చేస్తుందన్నారు. చేరిన వారిలో ఉద్యోగులు వి.రాజు, జి.మౌనిక, పి.ప్రవంతి, ఎం.సుభద్ర, జి.లాల్, నాయకులు ఎస్.శ్రీనివాసచారి, వెంపటి వెంకటేశ్వర్లు, తోలెం కోటేశ్వరరావు, చంద్ర పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల కల సాకారం

- శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.3.03 కోట్లు మంజూరు
- తీరనున్న రైతులు, హమాలీల కష్టాలు



జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ యార్డుకు కేటాయించిన ప్రభుత్వ స్థలం

జూలూరుపాడు: ఇరవై ఏళ్లుగా జూలూరుపాడు తాత్కాలిక ఉప మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.3.03 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రెండు దశాబ్దాల రైతులు, హమాలీల కల సాకారం అయింది. దీనికోసం ఏళ్లుగా రైతులు, హమాలీలు, రాజకీయ పార్టీల నాయకులు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించారు. కొన్ని నెలల విషయాన్ని అఖిలపక్ష నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలియజేశారు.

స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేశారు. అయితే ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలోనే జూలూరుపాడు శాశ్వత మార్కెట్ కొనసాగనుంది. జూలూరుపాడు మండలం కొత్తగూడెం జిల్లాలో ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లా ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కొనసాగడం విశేషం. అయితే వ్యవసాయ మార్కెట్ అధికారులు విభజన కోసం ప్రతిపాదనలు పంపించారు. జూలూరుపాడు శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్కెటింగ్‌శాఖ టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. ఈ ఏడాది నుంచే శాశ్వత మార్కెట్ యార్డును అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు, హమాలీలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత తాత్కాలిక ఉప మార్కెట్ యార్డులో సుమారు 1000 మంది హమాలీలు ఉపాధి పొందుతున్నారు. 2018లో జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 218లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి కేటాయించారు.

2003లో కమిటీ ఏర్పాటు..

రాష్ట్ర ప్రభుత్వం 2003లో ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఏన్కూర్ వ్యవసాయ కమిటీ పరిధిలో జూలూరుపాడు మండలాన్ని చేర్చింది. ఆ తరువాత జూలూరుపాడులో తాత్కాలిక మార్కెట్ ఏర్పాటు చేసి రెండు దశాబ్ధాలుగా పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తోంది. ఇక్కడ ఏటా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. మార్కెట్ కమిటీకి రూ.2 కోట్ల ఆదాయం వస్తోంది. జూలూరుపాడు మార్కెట్ యార్డు నుంచి ఆదిలాబాద్, వరంగల్, గుంటూరు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఇక్కడి వ్యాపారులు పత్తిని ఎగుమతి చేస్తారు.

కష్టాలు తొలగిపోతాయి..



20 ఏళ్లుగా తాత్కాలిక మార్కెట్ యార్డులో పత్తి అమ్ముకునేందుకు వస్తే కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డాం. శాశ్వత మార్కెట్ యార్డు నిర్మిస్తే రైతుల కష్టాలు తీరతాయి. రెండు వారాల్లో పత్తితీతలు ప్రారంభం అవుతాయి. త్వరగా యార్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– యల్లంకి వెంకటేశ్వర్లు, రైతు జూలూరుపాడు

వర్షం వస్తే పత్తి తడవాల్సిందే..



ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా మార్కెట్‌కు తెచ్చిన పత్తి తడిసి ముద్దకావల్సిందే. మార్కెట్‌లో షెడ్లు, ఎలాంటి వసతులు లేవు. తాగునీరు, ఎండ నుంచి విశ్రాంతి తీసుకోవడానికి నిల్వ నీడ లేక ఇబ్బంది పడుతున్నాం. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– బానోత్ వెంకటేశ్వర్లు, రైతు సురారం

రైతులకు ప్రయోజనం..



జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణంతో రైతాంగానికి ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. ప్రస్తుత ఉప మార్కెట్‌లో పత్తి అమ్ముకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. శాశ్వత మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేసిన వైరా ఎమ్మెల్యే, మంత్రులకు కృతజ్ఞతలు.

– భూక్యా ప్రసాద్, రైతు అన్నారుపాడు

నామినేషన్ వేస్తున్నారా?!



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: పరిషత్ ఎన్నికలలో భాగంగా గురువారం మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణ ప్రారంభం కానుంది. నామినేషన్ వేసే అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఎంపీడీఓ ధన్‌సింగ్ పలు సూచనలు చేశారు. నామినేషన్ల పరిశీల తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలి. సంబంధిత ఓటరు లిస్టులో ఓటరుగా నమోదై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వారైతే కుల ధృవీకరణ పత్రం నామినేషన్‌తో జత చేయాలి. డిపాజిట్ సొమ్ము చెల్లించాలి. నేర చరిత్ర, చర, స్థిర ఆస్తులు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్ ఇద్దరు సాక్షులతో సంతకం పెట్టించి ఇవ్వాలి. ఎన్నికల ఖర్చు విధిగా నిర్వహిస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి. ఏ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారో నామినేషన్ పత్రంలో ముందే తెలపాలి. లేనిపక్షంలో బీఫారం ఇచ్చినా పార్టీ గుర్తు రాదు. ఒక్కో నామినేషన్‌లో ఒక పార్టీ పేరు రాయాలి. మొత్తం నాలుగు నామినేషన్లలో వేరు వేరుగా నాలుగు పార్టీల పేర్లు రాయొచ్చు. పార్టీ బీఫారం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా గుర్తు కేటాయిస్తారు. ఏ ప్రాదేశిక నియోజకవర్గం స్థానం నుంచి పోటీ చేస్తారో.. ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదకుడిగా ఉండాలి. అంతేకాకుండా నామినేషన్ పత్రంలో పార్ట్-1లో ప్రతిపాదకుని సంతకం, పార్ట్-2లో అభ్యర్థి సంతకం, పార్ట్-3లో కూడా అభ్యర్థి సంతకం, పార్ట్-4లో ఆర్‌ఓ సంతకం, పార్ట్-5 (రిజెక్టెడ్ నామినేషన్)లో కూడా ఆర్‌ఓ సంతకం ఉండాలి. పార్ట్-6 (రిసిప్ట్)లో ఆర్‌ఓ సంతకం ఉండాలి. అఫిడవిట్‌లో ఇద్దరు సాక్షుల సంతకం ఉండాలి. ఖర్చు వివరాలకు సంబంధించిన డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం ఉండాలి. ఈ జాగ్రత్తలు పక్కాగా తీసుకున్న వారి నామినేషన్ మాత్రమే చెల్లుబాటు అవుతుందని సూచించారు.

కొత్త అకౌంట్‌లోనే ఎన్నికల ఖర్చులు చూపాలి

ఇల్లెందురూరల్: పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కలిగినవారు నామినేషన్‌కు ముందే బ్యాంక్ అకౌంట్ నూతనంగా ప్రారంభించాలని ఎంపీఓ చిరంజీవి సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఖర్చు సజావుగా లెక్కించేందుకు వీలుగా నూతన అకౌంట్ అవసరాన్ని అభ్యర్థులు గుర్తించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రంతోపాటు కొత్త బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ జత చేయాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో వినియోగించిన అకౌంట్‌ను జత చేస్తే అందులో ఎటువంటి డబ్బు జమ అయినా ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తామని తెలిపారు. అభ్యర్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఈఎస్ఐ సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు



మాట్లాడుతున్న జీఎం(పర్సనల్) కవితానాయుడు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి సంస్థలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ పథకం అమలు చేసేందుకు బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం జరిగింది. జీఎం(పర్సనల్) ఐఆర్ – పీఎం కవితానాయుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో సింగరేణి సంస్థ చైర్మన్ – మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ చొరవతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించబోతున్నామని, ఇందులో భాగంగా ముందుగా కొత్తగూడెం రీజియన్‌లోని కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాల నాన్ – మైనింగ్ కాంట్రాక్టు కార్మికులకు పైలట్ ప్రాజెక్టు కింద ఈఎస్ఐ సదుపాయం కల్పించటానికి కాంట్రాక్టర్లకు, కాంట్రాక్టర్ల ఉద్యోగులకు సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈఎస్ఐ పథకంలో సభ్యత్వం పొందేందుకు కాంట్రాక్ట్ ఉద్యోగుల నెల జీతం రూ.21,000 లోపు ఉండాలని, మొదటి దశ సభ్యత్వ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులు గల కాంట్రాక్టర్లకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. రెండో దశలో 10 మంది కంటే తక్కువ కాంట్రాక్టు ఉద్యోగులు గల కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈఎస్ఐ పథకం ద్వారా కాంట్రాక్టు కార్మికులకు వైద్య సదుపాయంతో పాటు బీమా కూడా ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) కే.అజయ్ కుమార్, డీజీఎం (పర్సనల్) వైవీఎల్ వరప్రసాద్, జీవీ మోహన్‌రావు, ఖమ్మం ఈఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ జి.సాయికుమార్, డీవైపీఎం నరేన్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సమీక్ష



మాట్లాడుతున్న సింగరేణి జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు, కార్మిక సంఘాల నేతలతో బొగ్గు గనుల భవిష్యనిధి ట్రైపర్టైట్ కోఆరినేటర్ సమావేశం జరిగింది. బుధవారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో రీజినల్ కమిషనర్స్ కె.వంశీధర్, సీఎంపీఎఫ్ కొత్తగూడెం కమిషనర్ కనకమ్మ పాల్గొని కార్మికుల సమస్యలపై చర్చించారు. సీఎంపీఎఫ్ సంబంధిత సమస్యలను, కాంట్రాక్ట్ ఉద్యోగుల సీఎంపీఎఫ్ సంబంధిత సమస్యలు, విడో పెన్షన్ సమస్యలపై చర్చించారు. జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ నాలుగు నెలలకోసారి ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) తుకారాం, డీజీఎం(సివిల్) రవికుమార్, డీజీఎం (ఎఫ్ఏ) మధుబాబు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్యాంప్రసాద్, సులోచన, వెంకటేశ్వర్లు, కార్మిక సంఘం నాయకులు నజీర్ అహ్మద్, జే.వెంకటేశ్వర్లు, పర్సనల్ అధికారి సుధాకర్, ఇక్బాల్ షరీఫ్, అశోక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


18లోగా దరఖాస్తు చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈనెల 18వ తేదీలోగా కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్.జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం స్టేషన్ పరిధిలో మొత్తం 19 మద్యం షాపులున్నాయని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు ఫారంతో పాటుగా రూ.3 లక్షల చలానా, డీడీతో పాటు ధ్రువపత్రాలను జత చేసి కొత్తగూడెం బాబుక్యాంపులోని జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. 23న కలెక్టర్ సమక్షంలో డ్రా ఉంటుందని తెలిపారు.

'స్థానికం'లో సత్తా చాటాలి

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీ కాలనీలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, అత్యధిక స్థానాల్లో గెలిపించి సత్తా చాటాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. యర్రంశెట్టి ముత్తయ్య, జానికిరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికపై నాయకుల కసరత్తు



పాల్వంచరూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఎంపికలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కసరత్తు మొదలు పెట్టారు. మండలంలో మొత్తం 10 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక జెడ్పీటీసీ గత ఎన్నికల్లో జనరల్ కాగా ఈసారి (ఎస్టీ మహిళ)కు రిజర్వ్ అయింది. జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహులైన మహిళా అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు. ఎవరి ప్రయత్నం వాళ్లు చేస్తున్నారు. పాండురంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అజ్మీర జగదీష్ భార్య రమ్య, అదే గ్రామానికి చెందిన విజయలక్ష్మి, సూరారం గ్రామానికి చెందిన సక్కుబాయి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎంపీపీ సరస్వతి పేరు వినిపిస్తోంది. నాయకులు జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీల అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఎంపీటీసీ స్థానాలు మండలంలో అన్ని ఎస్టీ రిజర్వ్ కావడంతో పోటీకి గిరిజన అభ్యర్థులు ఆసక్తి చూపకపోవడంతో నాయకులు గ్రామాల్లో తిరిగి అభ్యర్థుల ఎంపికకు సంప్రదింపులు చేస్తున్నారు. సీపీఐ అన్నిస్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తుండగా సీపీఎం ఐదు ఎంపీటీసీ, ఎనిమిది సర్పంచ్ పదవులకు పోటీ చేయాలని ఆ పార్టీ నాయకులు నిర్ణయించి అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు.

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు..



రైతులకు అవగాహన కల్పిస్తున్న మార్కెట్ సిబ్బంది

టేకులపల్లి: పత్తి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మకాలు, మద్దతు ధరలు, పంటల నమోదు విషయంలో ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇ.నరేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏఎంసీ సిబ్బందితో కలిసి మండలంలోని తొమ్మిదోమైలు తండా, మంగలితండా, బద్దుతండా గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. రైతులను కలిసి కేంద్ర మద్దతు ధరలు, సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి పంటను ఎలా అమ్ముకోవాలో, కపాస్ కిసాన్ యాప్ గురించి అవగాహన కల్పించారు. 2025 – 26 గాను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలను తెలియజేస్తూ కరపత్రాలను రైతులకు అందజేశారు. సూపర్‌వైజర్ ఎస్.శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం సంఘం కార్యాలయంలో జరిగింది. కొత్తగూడెం హెడ్ క్వార్టర్స్ యూనిట్ అధ్యక్షుడిగా ఎల్.రాములు, కార్యదర్శిగా ఐ.మనోహర్ భాస్కర్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎస్కే గులామొహమ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా సీహెచ్ఎల్ఎన్.శాస్త్రి, వి.జైన్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.స్వర్ణకుమారి, పబ్లిసిటీ సెక్రటరీగా ఏ.నరసింహారావులను ఎన్నుకుని, ప్రమాణ స్వీకారం చేయించారు.

సర్దుబాటులో జాప్యమెందుకు..?

- పాఠశాలల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- 26 పాఠశాలల్లో ఒక్కరితోనే నెట్టుకొస్తున్న విద్యాశాఖ
- మండలంలో గాడి తప్పుతున్న విద్యాబోధన



కొమరారం ప్రాథమిక పాఠశాల

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పదోన్నతలు, బదిలీల ప్రక్రియ పూర్తై నెల రోజులు గడుస్తోంది. బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారి నియామకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కనీసం క్లస్టర్ స్థాయిలో అయినా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జరగడం లేదు. దీంతో సర్దుబాటు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఫలితంగా పాఠశాలల్లో బోధన తడబడుతూ విద్యవ్యవస్థ గాడి తప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

మండలంలో 53 పోస్టులు ఖాళీ..

మండలంలో వివిధ యాజమాన్యాల పరిధిలో 113 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 87 కాగా ఐటీడీఏ ఆధ్వర్యంలో 26 పాఠశాలలు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి నెల రోజుల క్రితం ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించి బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్త వారి నియామకం లేకపోవడంతో మండలంలో ప్రస్తుతం 53 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సర్దుబాటుపై నీలినీడలు...

సాధారణంగా విద్యాశాఖ నిబంధనల ప్రకారం పది మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 61 నుంచి 90 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు, 91 నుంచి 120 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులను నియమించాలి. కానీ ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో అత్యల్పంగా 15, అత్యధికంగా 40 వరకు విద్యార్థులు ఉన్నారు. అంటే ప్రతీ పాఠశాలకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయుల నియామకం చేపట్టాల్సి ఉంది. కానీ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియతో 26 పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి అందుబాటులో సర్దుబాటుకు అవకాశం ఉన్న 16 పాఠశాలల్లో ఉపాధ్యాయుల జాబితాను మండల విద్యాశాఖ జిల్లా అధికారులకు నివేదించింది. కానీ జిల్లా స్థాయిలో పైరవీలు అధికంగా ఉండటం వల్లే సర్దుబాటు ప్రక్రియ ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం మండల స్థాయిలోనే 16 పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. కానీ ఉపాధ్యాయుల కొరత కారణంగా పది పాఠశాలల్లో సర్దుబాటుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా పాఠశాలల్లో ఐదు తరగతులలో విద్యార్థులు ఉన్నా ఒక్క ఉపాధ్యాయురాలి ద్వారానే బోధన కొనసాగిస్తున్నారు.

బోధనపై తీవ్ర ప్రభావం...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతున్నా విద్యాశాఖ మాత్రం అదేమీ పట్టనట్లుగా వ్యవహరించడం పాఠశాలల్లో బోధనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లి ఆ రోజు పాఠశాలకు అప్రకటిత సెలవుగానే భావించాల్సిన దుస్థితి నెలకొంది. విధులకు హాజరైనా ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పడం ఎంత వరకు సాధ్యమో విద్యాశాఖ అధికారులకే తెలియాలి.

నివేదిక ఇచ్చాం..



ఉపాధ్యాయుల పదోన్నతలు, బదిలీలతో ఏర్పడిన ఖాళీలను సర్దుబాటు విధానంలో భర్తీ కోసం జిల్లా విద్యాశాఖకు నెల రోజుల క్రితమే నివేదిక ఇచ్చాం. కానీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. తాత్కాలికంగా మండల స్థాయిలో సర్దుబాటు చేసినా ఇంకా ఖాళీలు ఉన్నాయి.

– ఉమాశంకర్, ఎంఈఓ, ఇల్లెందు

ప్రజాస్వామ్యంపై దాడి గర్హనీయం



కొత్తగూడెంఅర్బన్: ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన దాడి న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువల మీద దాడి చేయడమేనని, అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ని కఠినంగా శిక్షించాలని ఐవైసీ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు పాల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చీకటి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ప్రెసిడెంట్ ఈసం లక్ష్మణ్, భద్రాచలం ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, అశ్వారావుపేట ప్రెసిడెంట్ గుంపుల రవితేజ, డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీలు, మతిన్, రామ్మూర్తి, పవన్ ప్రణయ్ వెంకటేష్, అరుణ్, మౌనిష్, కల్లూరి సంపత్, అశోక్, ప్రేమ్, సదా, మహేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్ల కార్డులతో సీపీఐ అనుబంధ సంఘం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బరిగెల భూపేష్ కుమార్, సలిగంటి శ్రీనివాస్, చెన్నయ్య, కరిషా రత్నకుమారి, మామిడి ధనలక్ష్మి, రవికిరణ్, కొచ్చర్ల రాకేష్‌కాంత్, టి.నర్సింగరావు, జంగం ప్రసాదరావు, మంద నిర్మల, పి.భాగ్య, మద్దెల విజయలక్ష్మి, మేరుగు అనసూయ, ఏ.లక్ష్మీనారాయణ, రోజా పాల్గొన్నారు.